నమస్తే తెలంగాణ
రాజన్న సిరిసిల్ల
5 | కరీంనగర్, శనివారం 26 అక్టోబర్ 2024 | RAJANNA SIRCILLA

వీటీడీఏ పరిధిలోకి రాజన్న సిరిసిల్ల జిల్లా

- మున్సిపల్ శాఖ అధికారిక ఉత్తర్వులు
- పరిధి పెంపుపై గ్రామీణ ప్రాంత ప్రజల ఆందోళన
- పన్నుల భారం, అనుమతుల్లో ఆంక్షలు ఉంటాయని కలవరం

వేములవాడ, అక్టోబర్ 25: వేములవాడ ఆలయ అభివృద్ధి కోసం ఏర్పాటు చేసిన వేములవాడ ఆలయ ఏరియా అభివృద్ధి ప్రాధికార సంస్థ పరిధిని జిల్లా మొత్తానికి విస్తరింపజేస్తూ ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటిదాకా వీటీడీఏ పరిధిలో వేములవాడ అర్బన్ మండలంలోని 11గ్రామాలతోపాటు వేములవాడ పురపాలక సంఘం మాత్రమే ఉండేది. అయితే కొత్తగా సిరిసిల్ల మున్సిపాలిటీతో పాటు, వేములవాడ రూరల్, బోయినపల్లి, ఇల్లంతకుంట, ఎల్లారెడ్డిపేట, వీర్నపల్లి, ముస్తాబాద్, గంభీరావుపేట, చందుర్తి, రుద్రంగి, కోనరావుపేట మండలాల్లోని 152 రెవెన్యూ గ్రామాలను వీటీడీఏ పరిధిలోకి తీసుకువస్తూ జీవో నంబర్ 184 ఈ నెల 15న విడుదల చేసింది. హెచ్ఎండీఏ హైదరాబాద్ తరహాలో జిల్లాను అభివృద్ధి చేసేందుకు వీటీడీఏ పరిధిని పెంచినట్టు ప్రభుత్వం ఉత్తర్వుల్లో పేర్కొంది. రాష్ట్ర ప్రభుత్వ మున్సిపల్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ దాన కిశోర్ పేరిట విడుదలైన వీటీడీఏ పరిధి విస్తరణ జీవో ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో చెక్కర్లు కొడుతున్నది.

పరిధి పెంపుపై గ్రామాల్లో ఆందోళన

వేములవాడ ఏరియా అభివృద్ధి ప్రాధికార సంస్థ పరిధిలోకి రాజన్న సిరిసిల్ల జిల్లా మొత్తాన్ని చేర్చడంపై గ్రామీణ ప్రాంత ప్రజలు ఆందోళన చెందుతున్నారు. పన్నుల భారం పడడంతోపాటు పలు రకాల అనుమతుల్లో అనేక ఆంక్షలు ఉంటాయని ఆందోళన చెందుతున్నట్లు తెలిసింది. హైదరాబాద్ హెచ్ఎండీఏ తరహాలో అభివృద్ధి చేసేందుకేనని ప్రభుత్వం ఉత్తర్వుల్లో పేర్కొన్నా, హైడ్రా పేరిట హైదరాబాద్‌లో నిర్మాణాలు కూల్చినట్టే ఇక్కడా కూల్చేందుకు పరిధి విస్తరణ చేశారని ఆందోళన చెందుతున్నారు. మరోవైపు పంచాయతీల్లో అనుమతులు కూడా వీటీడీఏ పరిధిలోకి రానుండగా, వాటి ప్రాధాన్యతను కూడా తగ్గించే అవకాశం ఉందని నాయకులు చెబుతున్నారు.

జాతీయ భావాలు పెంపొందించుకోవాలి

- ట్రినిటి విద్యాసంస్థల చైర్మన్ దాసరి ప్రశాంత్‌రెడ్డి

కేక్ కట్ చేస్తున్న దాసరి ప్రశాంత్‌రెడ్డి

కమాన్‌చౌరస్తా, అక్టోబర్ 25: విద్యార్థులు జాతీయ భావాలు పెంపొందించుకోవాలని ట్రినిటి విద్యాసంస్థల చైర్మన్ దాసరి ప్రశాంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం ఆయన బర్త్‌డే సందర్భంగా ఏర్పాటు చేసిన కేక్‌ను కట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఒకప్పుడు నలంద, తక్షశిల లాంటి యూనివర్సిటీల్లో విదేశీ విద్యార్థులు విద్యనభ్యసించేవారని గుర్తు చేశారు. విద్యార్థులు పాశ్చాత్య సంస్కృతిని విడనాడాలని, మన సంస్కృతీ సంప్రదాయాలను పాటించాలని సూచించారు. ఒక లక్ష్యంతో ముందుకెళ్లాలని, ఉన్నతంగా ఎదగాలని ఆకాంక్షించారు.

చెత్త పోగైతున్నదని రోడ్డునే మూసేశారు!

జ్యోతినగర్‌లో మూసి వేసి ఉన్న రోడ్డు

కార్పొరేషన్, అక్టోబర్ 25: కరీంనగర్ జ్యోతినగర్‌లో శివ థియేటర్ వెనుక రోడ్డులో చెత్త సేకరణకు డంపర్ బిన్స్ ఏర్పాటు చేశారు. ఈ ప్రాంతంలో వాహనాల రాకపోకలు ఎక్కువగా లేకపోవడం, ఇక్కడే డంపర్ బిన్ ఉండడంతో వివిధ కాలనీలకు చెందిన ప్రజలు, చుట్టూ ఉన్న వ్యాపారులు తమ చెత్తను అక్కడే వేస్తున్నారు. అయితే ఎప్పటికప్పుడు క్లియర్ చేయాల్సిన పారిశుధ్య విభాగం సిబ్బంది నిర్లక్ష్యం చూపారు. దీంతో ఈ ప్రాంతంలో చెత్త ఎక్కువగా పేరుకుపోగా, ట్రాక్టర్‌లో తరలించేందుకు ఇబ్బంది అవుతున్నదని భావించి ఏకంగా రోడ్డును మూసేశారు. దీనిపై ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. పర్యావరణ ఇంజినీర్ స్వామిని సంప్రదించగా, ఈ విషయం తమ దృష్టికి వచ్చిందని, రోడ్డును వెంటనే తెరిచేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు.

స్టూడెంట్స్ ఫుల్.. బస్సులు నిల్

తిమ్మాపూర్‌లో కిక్కిరిసి బస్సు ఎక్కుతున్న విద్యార్థులు, పుట్‌బోర్డుపై విద్యార్థులు

తిమ్మాపూర్, అక్టోబర్ 25 : తిమ్మాపూర్ ఎడ్యుకేషన్ హబ్‌లా మారింది. మూడు ఇంజినీరింగ్ కాలేజీలు, మరెన్నో స్కూళ్లు ఉండగా, నిత్యం వేలాది మంది విద్యార్థులు రాకపోకలు సాగిస్తున్నారు. అయితే కళాశాలలు, పాఠశాలలకు వచ్చిపోయేందుకు ఉదయం, సాయంత్రం చుక్కలు చూస్తున్నారు. విద్యాసంస్థల వేళలకు అనుగుణంగా బస్సులు లేకపోవడం, వచ్చిన బస్సులు అప్పటికే మహిళ ఉచిత ప్రయాణం కారణంగా నిండిపోవడంతో అవస్థలు పడుతున్నారు. ఎదురుచూపుల తర్వాత వచ్చిన ఒకటి, రెండు బస్సుల్లోనే ఎగబడుతున్నారు. కిక్కిరిసి, పుట్‌బోర్డుపై వేలాడుతూ ప్రమాదకరంగా ప్రయాణిస్తున్నారు. ఆర్టీసీ అధికారులు స్పందించి ఉదయం, సాయంత్రం వేళల్లో ప్రత్యేక బస్సులను తిప్పాలని విద్యార్థులు కోరుతున్నారు.

మరమగ్గాలపై భారం మోపద్దు

- మేం పదేళ్లపాటు ఆత్మహత్యలు లేకుండా పరిశ్రమలను నడిపించాం
- పది నెలల కాంగ్రెస్ పాలనలో కోతలు, చార్జీల మోతలు
- ఉచిత విద్యుత్ భారాన్ని చిన్న, మధ్య తరహా పరిశ్రమలపై వేయొద్దు
- చార్జీల పెంపు నిర్ణయం దారుణం
- ఆ ఆలోచనను విరమించుకోవాలి
- సాంచాలకు 5హెచ్‌పీ వరకు ఉచిత కరెంట్, 30హెచ్‌పీల వరకూ సబ్సిడీ ఇవ్వాలి
- ఈఆర్‌సీకి నివేదించిన బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

ఉచిత విద్యుత్ పేరిట ఉన్న విద్యుత్ పోగొట్టేందుకు కాంగ్రెస్ ప్రయత్నం చేస్తున్నది. విద్యుత్ చార్జీల మోతలతో పేద, మధ్య తరగతి ప్రజలపై భారం మోపబోతున్నది. మేం పదేళ్ల పాటు 24 గంటల ఉచిత విద్యుత్ ఇచ్చి అండగా నిలిచినం. కేసీఆర్ ప్రభుత్వంలో ఏనాడూ పైసా పెంచలేదు. ఆత్మహత్యలు, ఆకలిచావులు లేకుండా పరిశ్రమలను నడిపించినం. కానీ, పది నెలల కాంగ్రెస్ పాలనలో కరెంటు కోతలు, చార్జీల మోతలు దారుణం. 200 యూనిట్ల ఉచిత విద్యుత్ ఇస్తూ ఆ భారాన్ని చిన్న, మధ్య తరహా పరిశ్రమలపై మోపేందుకు చార్జీలు పెంచాలన్న నిర్ణయం దుర్మార్గం. సిరిసిల్ల మరమగ్గాలపై భారం మోపద్దు. ప్రజల క్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని చార్జీలు పెంచే ఆలోచనను విరమించుకోవాలి. ప్రభుత్వం అసంబద్ధంగా ముందుకు పోతే ప్రజల్ని ఐక్యం చేసి ప్రజా పోరాటం ద్వారా అడ్డుకుంటం. పైసా పెంచినా ప్రధాన ప్రతిపక్షంగా వ్యతిరేకిస్తూ కొట్లాడుతం.

\- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

వేదికపై ఈఆర్‌సీ చైర్మన్ తన్నీరు శ్రీరంగారావు, ఈఆర్‌సీ టెక్నికల్ మెంబర్ మనోహర్ రాజు, ఈఆర్‌సీ ఫైనాన్స్ మెంబర్ బండారు క్రిష్ణయ్య

సిరిసిల్లలోని పద్మనాయక కల్యాణ మండపంలో తెలంగాణ విద్యుత్ నియంత్రణ మండలి ఆధ్వర్యంలో నిర్వహించిన బహిరంగ విచారణ కార్యక్రమానికి హాజరైన అధికారులు, సెస్ వినియోగదారులు, ప్రతినిధులు

రాజన్న సిరిసిల్ల, అక్టోబర్ 25 (నమస్తే తెలంగాణ)/ సిరిసిల్ల టౌన్: కరెంటు చార్జీలు పెంచి వస్త్ర, ఇతర పరిశ్రమలపై భారం మోపాలన్న కుట్రలను తిప్పికొడుతామని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ మాజీ మంత్రి, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ హెచ్చరించారు. ఉచిత్ విద్యుత్ భారాన్ని మధ్యతరగతి, చిన్న పరిశ్రమలపై మోపాలన్న ఆలోచన ఏ మాత్రం సరైంది కాదని హితవు పలికారు. పదేండ్లలో ఆత్మహత్యలు లేకుండా సిరిసిల్ల వస్త్ర పరిశ్రమను నడిపించామని, కానీ, ఇప్పుడు మరమగ్గాలపై భారం మోపితే సహించేదిలేదని స్పష్టం చేశారు. చిన్న, భారీ పరిశ్రమలను ఒకే గొడుగు కిందకు తెచ్చి విద్యుత్ చార్జీలు వేయడం చిన్న, మధ్య తరగతి పరిశ్రమలకు ఉరివేసినట్లేనన్నారు. డిస్కంల నిర్ణయం కారణంగా పరిశ్రమలు మూతపడి లక్షలాది మంది కార్మికులు రోడ్డున పడే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఇలాంటి పరిస్థితిలో పరిశ్రమలను కాపాడుకునేలా వీలైనంత వరకు ప్రోత్సాహకాలు అందించాలని కోరారు. సిరిసిల్ల పట్టణంలోని పద్మనాయక కల్యాణ మండపంలో గురువారం విద్యుత్ నియంత్రణ మండలి (ఈఆర్‌సీ), సిరిసిల్ల సహకార విద్యుత్ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో చైర్మన్ తన్నీరు శ్రీరంగారావు అధ్యక్షతన బహిరంగ విచారణ జరిపారు. కేటీఆర్ పాల్గొని, విద్యుత్ చార్జీలు, వస్త్ర పరిశ్రమ ఎదుర్కొంటున్న సమస్యలను ఈఆర్సీ దృష్టికి తీసుకెళ్లారు. చేనేత జౌళీశాఖ మంత్రిగా, సిరిసిల్ల ఎమ్మెల్యేగా, నేతన్నల సమస్యలు తెలిసిన వ్యక్తిగా సమస్యలను ముందుంచానని, వాటిని పరిష్కరించాలని కోరారు. విద్యుత్ చార్జీల పెంపు ప్రతిపాదనపై అభ్యంతరాలను వ్యక్తం చేస్తూ దాదాపు గంటపాటు ప్రసంగించారు. పదేళ్ల కేసీఆర్ పాలనలో సిరిసిల్ల వస్త్ర పరిశ్రమకు విద్యుత్ సబ్సిడీ ఇచ్చి నేతన్నల ఆత్మహత్యలను నివారించామని తెలిపారు. బతుకమ్మ చీరలు, కేసీఆర్ కిట్లు, రంజాన్, క్రిస్మస్ ఆర్డర్లు ఇచ్చి పరిశ్రమను బతికించే స్థితికి తెచ్చామని చెప్పారు. దేశంలో ఎక్కడా లేని విధంగా ₹400 కోట్లతో వర్కర్ టూ ఓనర్ అనే అద్భుతమైన పథకం ప్రవేశపెట్టామని, అప్పారెల్, టెక్స్‌టైల్ పార్కులను బలోపేతం చేశామని తెలిపారు. మరమగ్గాల ఆధునీకరణ చేపట్టిన విషయాన్ని దృష్టికి తీసుకొచ్చారు. కానీ, పది నెలల కాంగ్రెస్ ప్రభుత్వంలో కరెంటు కోతలు, చార్జీల మోతలతో ఆగమయ్యే పరిస్థితి వచ్చిందన్నారు. విద్యుత్ ఆధారిత వస్త్ర పరిశ్రమ తీవ్ర సంక్షోభంలోకి వెళ్లి నేతన్నలు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఒక్క సిరిసిల్లలోనే పది మంది, ఇతర జిల్లాలో ఎనిమిది మంది ఆత్మహత్యలు చేసుకోవడం బాధాకరమని ఆవేదన చెందారు. నేతన్నల సంక్షేమం కోసం వ్యవసాయానికి ఇస్తున్న మాదిరిగా సాంచాలకు 5హెచ్‌పీల వరకు ఉచిత విద్యుత్ ఇవ్వాలని కోరారు. నాణ్యమైన వస్త్ర ఉత్పత్తులు చేస్తున్న మరమగ్గాలకు ప్రస్తుతం ఇస్తున్న 10హెచ్‌పీల సబ్సిడీ విద్యుత్‌ను 30హెచ్‌పీలకు పెంచాలని, ఈ ప్రతిపాదనను లిఖిత పూర్వకంగా ప్రభుత్వానికి ఇవ్వాలని ఈఆర్‌సీని కోరారు. నాయీబ్రాహ్మణులు, రజకులు, రైతులకు ఉచిత విద్యుత్ ఇచ్చిన తమ ప్రభుత్వం ఏనాడు చార్జీలు పెంచాలని ఆలోచించలేదని చెప్పారు. 200 యూనిట్ల ఉచిత విద్యుత్ ఇస్తున్న ప్రభుత్వం, ఆ భారాన్ని చిన్న, మధ్య తరహా పరిశ్రమలపై మోపేందుకు చార్జీలు పెంచాలన్న నిర్ణయం దుర్మార్గమన్నారు. డిస్కంలంటే డిస్ట్రిబ్యూషన్ సంస్థలేనని, ఖజానాకు కంట్రిబ్యూషన్ చేసే కంపెనీలు కాదని పేర్కొన్నారు. సిరిసిల్లలో 1.26లక్షల గృహ కనెక్షన్లు ఉన్నాయని, ఎండకాలంలో 300 యూనిట్లు దాటుతున్నాయని చెప్పారు. అది దాటితే కిలోవాట్‌కు వసూలు చేస్తున్న ఫిక్స్ చార్జీని ₹10 నుంచి ₹50కి పెంచాలన్న నిర్ణయాన్ని వాయిదా వేసుకోవాలని డిమాండ్ చేశారు.

సెస్‌ను కాపాడుకోవాలి

1975లో దివంగత చెన్నమనేని రాజేశ్వర్‌రావు స్థానిక పెద్దలతో కలిసి తీసుకొచ్చిన సంస్థ సెస్ అని కేటీఆర్ తెలిపారు. దేశంలోనే సహకార రంగంలో ఉన్న ఏకైక సంస్థ ఇది మాత్రమే ఉందన్నారు. డిస్కంలతో అద్భుతంగా పోటీ పడుతూ వినియోగదారులకు సేవలందిస్తున్నదని చెప్పడానికి గర్వంగా ఉందన్నారు. అలాంటి సెస్‌ను బోర్డులో కలుపాలని నాటి సమైక్య ప్రభుత్వాలు చేసిన ప్రతిపాదనలను ఈప్రాంత రైతులు, ప్రజలు పోరాటం చేసి కాపాడుకున్నారని గుర్తు చేశారు. అటువంటి సంస్థను కాపాడుకోవాల్సిన బాధ్యత మన అందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో కేడీసీసీబీ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు, సెస్ పాలకవర్గ సభ్యులు, మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ, జడ్పీ మాజీ చైర్‌పర్సన్లు తుల ఉమ, న్యాలకొండ అరుణ, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, పట్టణాధ్యక్షుడు జిందం చక్రపాణి, సెస్ ప్రతినిధి బియ్యంకార్ శ్రీనివాస్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

చార్జీల పెంపుపై అభ్యంతరాలు

కరెంటు చార్జీలు పెంచాలన్న డిస్కంలు చేస్తున్న ప్రతిపాదనలను ప్రజలంతా ముక్త కంఠంతో వ్యతిరేకించారు. ఉచిత కరెంటు ఇచ్చిన భారాన్ని పేద, మధ్య ప్రజలపై మోపుతుండంటూ నిరసన వ్యక్తం చేశారు. విద్యుత్ నియంత్రణ మండలి బహిరంగ విచారణలో వినియోగదారులు, పారిశ్రామిక వేత్తలు పాల్గొని తమ అభ్యంతరాలను ఈఆర్‌సీకి వ్యక్తం చేశారు. చార్జీలు పెంచితే సిరిసిల్ల వస్త్ర పరిశ్రమతో పాటు చిన్న కుటీర పరిశ్రములు, రైస్ మిల్లులు మూతపడే పరిస్థితి ఉంటుందని సూచించారు. విద్యుత్ బిల్లులు భారమై ఇప్పటికే టెక్స్‌టైల్స్ పార్కు మూసి వేసిన విషయాన్ని దృష్టికి తీసుకొచ్చారు. చార్జీలు పెంచితే పరిశ్రమలకు ఉరివేసినట్లేనని, ఈ ప్రతిపాదనలను ప్రభుత్వం విరమించుకోవాలని డిమాండ్ చేశారు.

వస్త్ర పరిశ్రమపై మోయలేని భారం

నాటి ప్రభుత్వం విద్యుత్ చార్జీల పెంపునకు ఎటువంటి ప్రతిపాదనలు పెట్టలేదు. ప్రస్తుతం వచ్చిన కొత్త ప్రభుత్వం ప్రతిపాదనలు తేవడం విచారకరం. దీని ద్వారా వినియోగదారులపై భారం పడుతుంది. రాష్ట్రంలో వ్యవసాయం తర్వాత అత్యంత ప్రాధాన్యత కలిగింది వస్త్ర పరిశ్రమ. సిరిసిల్లలో దాదాపు 25వేలకు పైగా మరమగ్గాలు ఉన్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం బతుకమ్మ చీరెల ఆర్డర్లు నిలిపివేయడం, కొత్త ఆర్డర్లు ఇవ్వకపోవడంతో చాలా ఇబ్బందికర పరిస్థితులు తలెత్తాయి. చేనేత రంగంపై జీఎస్టీ భారం పడుతున్నది. విద్యుత్ సంస్కరణల ద్వారా సత్ఫలితాలు రావాలి. కానీ, చార్జీలు పెంచడం ద్వారా వస్త్ర పరిశ్రమపై మోయలేని భారం పడుతుంది. ప్రభుత్వం పెంపు నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి.

\- ఎల్ రమణ, ఎమ్మెల్సీ

పెంపు నిర్ణయం సరికాదు

విద్యుత్ చార్జీల పెంపు నిర్ణయం సరైంది కాదు. చొప్పదండి నియోజకవర్గంలో వస్త్ర పరిశ్రమకు అనుబంధం ఉన్నది. చార్జీల పెంపు ద్వారా వస్త్ర పరిశ్రమపై భారం పడుతున్నది. ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోయిన సందర్భంలో వాటి స్థానంలో కొత్త విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటుకు రైతుల నుంచి చార్జీలు వసూలు చేస్తున్నారు. దీని ద్వారా రైతులపై భారం పడుతున్నది. కాలిపోయిన ట్రాన్స్‌ఫార్మర్ల స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయడంలో జాప్యం చేస్తున్నారు. ఫిర్యాదు వచ్చిన వెంటనే అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించేలా చూడాలి. వినియోగదారులపై భారం మోపేలా ప్రభుత్వం తీసుకున్న చార్జీల పెంపు నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి.

\- రవిశంకర్ సుంకె, మాజీ ఎమ్మెల్యే

30హెచ్‌పీ వరకు సబ్సిడీ ఇవ్వాలి

చంద్రబాబు ప్రభుత్వ హయాంలో సిరిసిల్లలోని కుటీర పరిశ్రమలకు 10హెచ్‌పీ వరకు 50శాతం సబ్సిడీ అమలుచేశారు. 30హెచ్‌పీ వరకు 50 శాతం సబ్సిడీ అమలుచేసేలా ఆలోచన చేయాలి. సిరిసిల్ల పరిశ్రమకు పూర్తిస్థాయిలో సబ్సిడీ అందించాలి. దీని ద్వారా ప్రభుత్వంపై ₹12కోట్ల వరకు భారం పడుతుంది, కానీ ఇక్కడ పరిశ్రమ పన్నుల రూపంలో ప్రభుత్వానికి ₹70కోట్ల వరకు ఆదాయం వస్తుంది.

\- తాటిపాముల దామోదర్, చేనేత వస్త్ర వ్యాపార సంఘం అధ్యక్షుడు (సిరిసిల్ల)

లోడ్ పరిమితి పెంచాలి

వ్యవసాయ రంగానికి ఇస్తున్న 5హెచ్‌పీల విద్యుత్‌ను 7.5 హెచ్‌పీలకు పెంచాలి. సెస్ కొనుగోలు చేసే విద్యుత్‌పై సర్‌చార్జీలను మినహాయించాలి. సిరిసిల్లలో 25,494 మరమగ్గాలున్నాయి. వీటికి 10హెచ్‌పీల లోడ్ పరిమితి నుంచి 30హెచ్‌పీలకు పెంచాలి. సెస్ కొనుగోలు చేసే విద్యుత్ యూనిట్‌కు 4.84పైసలుగా నిర్ణయించారు. పెంచిన ధరను పునఃసమీక్షించి పాత ధరకు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలి.

\- చిక్కాల రామారావు
సెస్‌చైర్మన్

చేప పిల్లలు నాసిరకం

పంపిణీకి తెచ్చిన చేప పిల్లలు

- పెద్దపల్లి జిల్లాలో అస్తవ్యస్తంగా పంపిణీ!
- నిబంధనలు పట్టని కాంట్రాక్టర్లు
- కాలం దాటిన తర్వాత చేప విత్తనాలు
- పైగా తగ్గిన సైజు.. నాసిరకం
- అడ్డుకొని వాపస్ పంపిన మత్స్యకారులు
- రాష్ట్ర మత్స్యశాఖ చైర్మన్‌కు ఫిర్యాదు
- కాంట్రాక్టర్‌కు నోటీసులు
- అధికారులపై ఆరోపణలు

చేప పిల్ల ఉండాల్సిన సైజు

చేప పిల్లల పంపిణీ అస్తవ్యస్తంగా మారింది. చెరువులు, కుంటలకు పూర్తిగా నాసిరకం సీడ్ వస్తున్నది. మత్స్యకారుల అభ్యున్నతే లక్ష్యంగా గత ప్రభుత్వం చెరువులను బట్టి మంచి సైజు పిల్లలు పంపిణీ చేయగా, ప్రస్తుత కాంగ్రెస్ సర్కారు మాత్రం నిర్లక్ష్యం చూపినట్టు తెలుస్తున్నది. ఆగస్టు చివరి నుంచి పంపిణీ చేయాల్సి ఉన్నా.. పిల్లలను కాలం దాటిన తర్వాత పూర్తిగా నాణ్యతలేనివి సరఫరా చేయడంపై పెద్దపల్లి జిల్లాలో మత్స్యకారుల నుంచి ఆగ్రహం వ్యక్తమైంది. ఎక్కడికక్కడ అడ్డుకోవడంతో సరఫరా దాదాపుగా నిలిచిపోయింది. అయితే ఈ విషయంలో ఇప్పటికే ఫిర్యాదులు రావడంతో కాంట్రాక్టర్‌కు నోటీసులు ఇవ్వగా, తాజాగా జిల్లా అధికారిని బదిలీ చేసినట్టు తెలిసింది.

పెద్దపల్లి, అక్టోబర్ 25 (నమస్తే తెలంగాణ): ఏటా చెరువులు, కుంటల్లో ఆగస్టు చివరి వారం వరకూ ఉచిత చేప పిల్లలను పంపిణీ ప్రారంభించి, రెండు నెలల్లో పూర్తి చేయాలి. టెండర్ల ప్రక్రియ నుంచి మొదలుకొని పంపిణీ వరకూ ప్రభుత్వ అధికారుల పర్యవేక్షణలోనే జరగాలి. అందుకు సీడ్ నాణ్యత, ఆరోగ్య పరిస్థితిని మత్స్యశాఖ అధికారులు పరీక్షించి పంపిణీ చేయాలి. ఏడాదంతా నీరుండే చెరువుల్లో 80 నుంచి 100మిల్లీ మీటర్ల చేప పిల్లలు, సీజనల్ ట్యాంకు (చిన్న చెరువు)ల్లో 35 నుంచి 40మిల్లీ మీటర్ల సైజు చేపపిల్లలను నీటి విస్తీర్ణాన్ని బట్టి పోయాల్సి ఉంటుంది. కానీ, యేడాది పంపిణీ అంతా అస్తవ్యస్తంగా మారింది. కాంగ్రెస్ ప్రభుత్వం ఎలాంటి ప్రణాళికలు చేయకపోవడం, డిసెంబర్ వరకు గతంలో చేప పిల్లలు పంపిణీ చేసిన కాంట్రాక్టర్లకు పెండింగ్‌లో ఉన్న బిల్లులను చెల్లించకపోవడంతో ఆలస్యమైంది. టెండర్లు పిలిచినా వేలంలో పాల్గొనేందుకు సీడ్ ఉత్పత్తిదారులు ముందుకు రాలేదు. గతేడాది పెద్దపల్లి జిల్లాలో కోటి 90లక్షల చేప పిల్లలను పంపిణీ చేయగా, ఈ యేడాది అందులో సగం చేసి టెండర్లు పిలువడంతో చివరికి కరీంనగర్, జగిత్యాలకు చెందిన కాంట్రాక్టర్లు టెండర్లను దక్కించుకున్నారు.

పంపిణీ అడ్డగింత

పెద్దపల్లి జిల్లాలో 127 మేజర్ చెరువులు, 974 చిన్న చెరువులు, కుంటలు ఉన్నాయి. 157మత్స్య సహకార సంఘాలు ఉండగా, వాటి పరిధిలో 12,642 మంది మత్స్యకారులు, ఇంకా సభ్యత్వాలు లేక మరో 3వేల మంది చేపల వేటే వృత్తిగా జీవిస్తున్నారు. వీరి అభ్యున్నతే లక్ష్యంగా ఏటా ఉచిత చేపలను పంపిణీ చేస్తున్నారు. ప్రతి సంవత్సరం ఆగస్టు చివరి వారం వరకు పంపిణీ ప్రారంభించాల్సి ఉన్నా.. ఈసారి ఒక నెల ఆలస్యంగా అక్టోబర్‌లో శ్రీకారం చుట్టారు. ఈ నెల 7న మంథని తమ్మిచెరువులో రాష్ట్ర ఫిషర్‌మెన్ ఫెడరేషన్ చైర్మన్ లాంఛనంగా ప్రారంభించారు. ఆ రోజు మంచి సైజు చేప పిల్లలే రావడంతో ఆలస్యంగానైనా నాణ్యమైనవే ఇచ్చారని మత్స్యకారులు ఆనందపడ్డారు. కానీ, ఆ తర్వాత నాసిరకం ఇవ్వడంతో నిరాశ చెందారు. ఈ నెల 18నుంచి నవంబర్ 3వరకూ చేప పిల్లల పంపిణీకి మత్స్యశాఖ షెడ్యూల్‌ను ప్రకటించడం, తొలిరోజు అంతర్గాం, రామగుండం, పాలకుర్తి మండలాల్లోని చెరువుల వద్దకు చేప పిల్లలతో కాంట్రాక్టర్లు, జిల్లా మత్స్యశాఖ అధికారులు వెళ్లారు. విత్తనాలు పూర్తిగా చిన్నగా చింతాకు సైజులో ఉండడంతో మత్స్యకారులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ వాపస్ పంపారు. అయినప్పటికీ 19న మంథని మండలంలో చేప పిల్లలను పంపిణీ చేయడానికి వెళ్లగా, అక్కడా అడ్డుకొని చేపపిల్లల వ్యాన్లను వెనక్కి పంపారు.

పర్యవేక్షణ కరువు

ఉచిత చేప పిల్లల పంపిణీకి సంబంధించి క్షేత్రస్థాయిలో రెండు కమిటీలు పనిచేస్తాయి. ఒక కమిటీ నాణ్యమైన సీడ్ కోసం సీడ్ కంపెనీలను ఎంపిక చేసేందుకు పనిచేస్తుండగా.. మరో కమిటీ క్షేత్రస్థాయిలో చెరువులు, కుంటల్లో చేప పిల్లలను వదిలే సమయంలో నాణ్యతను పరిశీలిస్తుంది. కానీ, జిల్లాలో ఈ రెండు కమిటీల నిర్లక్ష్యం వల్ల నాసిరకమైన చేప పిల్లలు వచ్చాయి. సీడ్ కంపెనీని ఎంపిక చేసే సమయంలో జిల్లా మత్స్యశాఖ అధికారి, జిల్లా మత్స్యసహకార సంఘం అధ్యక్షుడు, జిల్లా కేంద్రానికి చెందిన ఒక తహసీల్దార్, జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి నేతృత్వంలోని కమిటీ సీడ్ పంపెనీలను పరిశీలిస్తున్నది. అక్కడ వాటి నాణ్యతను పరిశీలిస్తుంది. ఆ తర్వాత ఏ మండలానికి, ఏ గ్రామానికైతే చేప పిల్లలను కాంట్రాక్టర్ తీసుకువస్తారో అక్కడ జిల్లా మత్స్యశాఖ అధికారి, జిల్లా మత్స్య సహకార సంఘం అధ్యక్షుడు, ఆ మండల తహసీల్దార్, ఎంపీడీవో, జీపీ కార్యదర్శి, ఆ గ్రామ మత్స్య సహకార సంఘం ప్రతినిధులు వాటి నాణ్యతను పరిశీలించి ఆ చేప పిల్లలు నాణ్యమైనవి అయితేనే వాటిని ఆ చెరువుల్లో వదులుతారు. కానీ, ఇక్కడ మత్స్యసహకార సంఘాలు మినహా ఎవరూ పరిశీలించక పోవడం వల్లే చేప చిన్నబోయింది. చెరువులు కుంటల్లో బొచ్చె, రవ్వు, బంగారు తీగ రకాలను పంపిణీ చేయాల్సి ఉన్నా, ఏవో నాసిరకమైన చేప పిల్లలను తీసుకొని వచ్చి పంపిణీకి సిద్ధపడ్డారు. పైగా ఉండాల్సిన సైజ్ కంటే తక్కువ.. నాసిరకం చేపలు పంపిణీ చేస్తున్నారని మత్స్యకారులు అడ్డుకున్నారు.

ఫిర్యాదులు.. చర్యలు

కాంట్రాక్టర్లు నాణ్యత లేని చేప పిల్లలను పంపిణీ చేయడంపై పెద్దపల్లి జిల్లా మత్స్య సహకార సంఘం అధ్యక్షుడు కొలిపాక నర్సయ్య, డైరెక్టర్లు పోతరవేన క్రాంతి, కొలిపాక శ్రీనివాస్ హైదరాబాద్‌లోని స్టేట్ ఫిషరీస్ కార్యాలయానికి వెళ్లి రాష్ట్ర మత్స్యశాఖ చైర్మన్ మెట్టు సాయి కుమార్‌కు ఫిర్యాదు చేశారు. బాధ్యులపై చర్యలు తీసుకోవాలని వినతి పత్రం సమర్పించారు. దీంతో కాంట్రాక్టర్లను బ్లాక్‌లిస్ట్‌లో పెడుతామని చైర్మన్ వారికి ఆయన హామీ ఇచ్చారు. ఆ మేరకు చర్యలు చేపట్టారు. ఈ నెల 18, 19 తేదీల్లో అంతర్గాం, పాలకుర్తి, రామగుండం, మంథనిల్లో నాసిరకమైన చేప పిల్లలు తెచ్చారని కరీంనగర్‌కు చెందిన కాంట్రాక్టర్ శ్రీ వర్షిణీ ఫిష్ సీడ్ యజమాని వినోద్‌కు జిల్లా మత్స్యశాఖ అధికారులు నోటీసులు ఇచ్చారు. తాజాగా నాసిరకం చేప పిల్లల పంపిణీపై వచ్చిన ఆరోపణలు, ఫిర్యాదుల నేపథ్యంలో జిల్లా మత్స్యశాఖ అధికారి భాస్కర్‌ను బదిలీ చేసినట్టు తెలిసింది.

కాంగ్రెస్ నాయకుడి హత్య కేసులో నిందితుడి అరెస్ట్

- పాత కక్షలే కారణం
- వివరాలు వెల్లడించిన జగిత్యాల ఎస్పీ అశోక్ కుమార్

జగిత్యాల, అక్టోబర్ 25: కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి అనుచరుడు మారు గంగారెడ్డి హత్య కేసులో నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. పాత కక్షల కారణంగానే హత్య చేసినట్టు ధ్రువీకరించారు. ఈ మేరకు ఎస్పీ అశోక్ కుమార్ ఒక ప్రకటన విడుదల చేశారు. ఆ వివరాల ప్రకారం.. జగిత్యాల రూరల్ మండలం జాబితాపూర్‌కు చెందిన కాంగ్రెస్ నేత, మాజీ ఎంపీటీసీ మారు గంగారెడ్డి(58)కి, అదే గ్రామానికి చెందిన బత్తిని సంతోష్‌కు రెండేళ్లుగా వ్యక్తిగతంగా గొడవలు ఉన్నాయి. సంతోష్ తండ్రి లచ్చయ్యకు, లచ్చయ్య తమ్ముడికి మధ్య భూ తగాదాల్లో తన కుటుంబానికి వ్యతిరేకంగా గంగారెడ్డి వ్యవహరించాడని, అలాగే గతంలో అట్రాసిటీ కేసు పెట్టడానికి కూడా కారణమని సంతోష్ భావించి గంగారెడ్డిపై కక్ష పెంచుకున్నాడు. అట్రాసిటీ కేసు విచారణ చివరి దశలో ఉండగా, రాజీ కుదుర్చేందుకు తనకు సహకరించాలని గంగారెడ్డిని కోరాడు. అందుకు నిరాకరించడమే కాకుండా తనను అవమానించాడనే విషయాన్ని మనసులో పెట్టుకొని చంపాలనుకున్నాడు. పథకం ప్రకారమే ఒక కారును అద్దెకు తీసుకున్నాడు. ఈ నెల 22న గ్రామంలోని ఓ హోటల్లో టీ తాగి బైక్‌పై ఇంటికి వెళ్తున్న గంగారెడ్డిని వెనుక నుంచి కారుతో ఢీ కొట్టాడు. కింద పడిపోగానే తన వెంట తీసుకొచ్చిన కత్తితో దాడి చేశాడు. దీంతో గంగారెడ్డి అక్కడికక్కడే చనిపోయాడు. ఆయన భార్య మారు లక్ష్మి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, శుక్రవారం నిందితుడు సంతోష్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. హత్య వెనుక ఇంకా ఎవరైనా వ్యక్తులు ఉన్నారా..? అనే కోణంలో విచారణ కొనసాగిస్తున్నామని ఎస్పీ తెలిపారు.